# వాల్మీకి, బోయలను షెడ్యూల్ తెగల జాబితాలో చేర్చాలని కోరుతూ

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ తీర్మానం

భారతదేశంలోని అత్యధిక రాష్ట్రాలలో షెడ్యూల్డ్ కులాలు/షెడ్యూల్డ్ తెగలుగా ఉన్న వాల్మీకి/బోయలను మన రాష్ట్రంలో కూడా ఎస్టీ జాబితాలో చేర్చాలన్న దశాబ్దాల నాటి డిమాండుకు ఆంధ్రప్రదేశ్ శాసనసభ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ తీర్మానిస్తోంది. వాల్మీకి/బోయల పురాతన, చారిత్రక, భౌగోళిక, సాంఘిక లక్షణాలు, వారి సంస్కృతి, వెనుకబాటుతనం, ఆర్థిక స్థితిగతులు, అనేక అధ్యయన కమిటీలు, కమిషన్లు వీరిపై చేసిన సిఫారసులను పరిగణనలోకి తీసుకుని వెంటనే ఈ కులాలను షెడ్యూల్డ్ తెగల జాబితాలోకి చేర్చడానికి అవసరమైన చర్యలను సాధ్యమైనంత త్వరగా తీసుకొనవలసిందిగా భారతదేశ ప్రభుత్వాన్ని కోరుతూ ఈ శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానిస్తున్నది.

వాల్మీకి, బోయ అనే రెండు పేర్లతో పిలిచే ఈ పురాతన తెగ షెడ్యూల్డ్, నాన్ షెడ్యూల్డ్ ప్రాంతాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటా చెల్లాచెదురుగా విస్తరించి అత్యంత దయనీయ పరిస్థితులలో జీవిస్తున్నట్టు అనేక సమగ్ర అధ్యయనాల ద్వారా వెల్లడైన అంశాలన్నింటినీ కూలంకషంగా చర్చించి వీరు భారతదేశంలో ఉన్న 33 గిరిజన గ్రూపులలో ఒక్కటిగా నిర్ధారిస్తూ ఈ శాసనసభ తీర్మానిస్తున్నది. షెడ్యూల్డ్ తెగల జాబితాలో చేర్చడానికి కేంద్ర ప్రభుత్వ నియమిత 'లోకూర్ కమిటీ' నిర్దేశించిన అర్హతలన్నింటినీ ఆంధ్రప్రదేశ్‌లో విస్తరించి ఉన్న వాల్మీకి, బోయలు కలిగివున్నట్టుగా ఈ శాసనసభ భావిస్తున్నది.

బోయ/ వాల్మీకి/ వాల్మీకి బోయ/ బోయ వాల్మీకి/ దొంగ బోయ/ దొర/ గెంటు/ మొండి బోయ/ బేదర్/ కిరాతక/ నిషాద/ ఎల్లాపి/ చుండు వాళ్లు/ పెద్ద బోయ/ తలయారి/ తలారి/ ఎల్లాపు/ చుండి నాయకులు/ గురికర/ కలావతిల బోయ/ కావలి వారు/ కిరాతకులు/ నాయకులు/ నిషాదులు/ శబరి/సుంకులమ్మ బోయ తదితర పేర్లతో పిలిచే ఈ తెగలవారు విభిన్నమైన సంస్కృతి, సాధారణ జనాలతో కలవలేకపోవడం, భౌగోళిక ఒంటరి జీవనం, వెనుకబాటుతనం, సాంఘిక పరిస్థితి, జాతరలు, జీవన విధానం, జీవన సామర్థ్యం, శారీరక రూపము, సామాజిక, ఆర్థిక పరిస్థితి, అత్యల్ప అక్షరాస్యత, జనాభా తరుగుదల తదితర లక్షణాల ద్వారా దేశంలోని ఇతర గిరిజన తెగలలో ఒకటిగా అనేక అధ్యయనాలు స్పష్టంగా ప్రకటించి వుండటాన్ని ఈ శాసనసభ గుర్తించింది. వీటికి తోడు మాజీ నేరస్థులనే ముద్ర, అమానవీయ వివక్ష, గ్రామ శివార్లకే పరిమితం చేసిన సామాజిక కట్టుబాట్లు, మగవాళ్లు వేటను, మహిళలు అటవీ ఉత్పత్తులను ఆధారంగా చేసుకుని జీవించడం తదితర అంశాలన్నింటి దృష్ట్యా వీరిని షెడ్యూల్డ్ తెగల జాబితాలోకి చేర్చడమే అన్నివిధాలుగా న్యాయం చేసినట్టు అవుతుందని శాసనసభ అభిప్రాయపడుతోంది.

ఇప్పటికే కర్ణాటక తదితర అనేక రాష్ట్రాలలో వీరిని షెడ్యూల్డ్ తెగలుగా గుర్తించారు. 1961లో భారతదేశపు జనగణన-ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త జనరల్ బీకే రాయ్ బర్మన్, 1961-62 ఆంధ్రప్రదేశ్ షెడ్యూలు తెగల విచారణ కమిటీ, 2016 ప్రొఫెసర్ పి.డి. సత్యపాల్ కుమార్ కమిటీ, 2017 ఆంధ్రప్రదేశ్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ క్యాస్ట్ & షెడ్యూల్డ్ ట్రైబ్ తదితర కమిటీలు, కమిషన్లు అధ్యయనం జరిపి చేసిన సిఫారసులు, కేంద్ర ప్రభుత్వ లోకూర్ కమిటీ నిర్దేశిత అర్హతలు.. అన్నింటినీ పరిశీలించి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ఉపనామాలతో పిలవబడుతున్న వాల్మీకి, బోయలను షెడ్యూల్డ్ తెగలోకి చేర్చడం అత్యంత ఆవశ్యమని ధృవీకరిస్తూ, అందుకు అనుగుణమైన చర్యలు తీసుకోవాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఈ శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానిస్తున్నది.